జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందిపడిన జిల్లా ప్రజలు వినాయకుడి ఆశీస్సులతో పాడి, పంటలతో, సుఖశాంతులతో ఎల్లప్పుడూ సుభిక్షంగా, ఆనందంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

కమ్యూనిస్టు యోధుడు ఆర్ఎస్‌కు కన్నీటి వీడ్కోలు

కన్నీంటి పర్యంతమౌతున్న కుటుంబ సభ్యులు

స్వగ్రామం చించినాడలో ముగిసిన అంత్యక్రియలు

వేలాదిగా తరలొచ్చిన ఉభయగోదావరి జిల్లాల ప్రజానీకం, నేతలు, కార్యకర్తలు

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు, మహిళా నేతలు

జోహార్ ఆర్ఎస్ అంటూ హోరెత్తిన నినాదాలు

ప్రజాశక్తి - భీమవరం, యలమంచిలి, ఆచంట

కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్)కు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆర్ఎస్ అంతిమయాత్ర అశ్రునయనాల నడుమ సాగింది. బరువెక్కిన గుండెతో ఉద్యమ యోధుడిని విడిచిపెట్టేందుకు ఉద్యమకారులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్యమాలే తన ఊపిరిగా తుదిశ్వాస వరకు పోరాడిన ఆర్ఎస్ ఇక లేరని జీర్ణించుకోలేక తల్లడిల్లారు. 'మీరు లేకున్నా.. మీరు నమ్మిన సిద్ధాంతం కోసం మీ ఆశయ సాధనకు అనుగుణంగా ముందుకు సాగుతాం' అంటూ ప్రతినబూనారు. జోహార్ ఆర్ఎస్ అంటూ నినాదాలతో చించినాడ మార్మోగింది.

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ఆయన స్వగ్రామం చించినాడలో శుక్రవారం జరిగాయి. ఉభయగోదావరి జిల్లాల ప్రజానీకం, నేతలు, మహిళలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు, సిపిఎం అగ్ర నేతలు, ప్రముఖులు, వ్యాపారులు, వైద్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వేలాదిగా తరలొచ్చారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి పి.మధు, రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, మంతెన సీతారాం, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ ఆర్ఎస్ భౌతికకాయాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన జరిగిన సభలో నేతలు మాట్లాడుతూ ఆర్ఎస్‌తో తమకున్న అనుబంధాన్ని, ఉద్యమ విషయాలను గుర్తు చేశారు. అలుపెరగని పోరాట యోధుడు ఆర్ఎస్ మన మధ్య లేకపోవడం బాధాకర విషయమన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం, ఆశయ సాధనకు కృషి చేయడమే ఆర్ఎస్‌కు నిజమైన నివాళి అని చెప్పారు. భౌతికంగా ఆర్ఎస్ లేకపోయినా ఎర్రజెండా ఉన్నంతకాలం ఆయన జ్ఞాపకాలు పదిలంగానే ఉంటాయన్నారు. ప్రజా పునాదిని మరింత బలపరిచి జిల్లాలో ప్రజా ఉద్యమాలను విస్తరింపజేసేలా ఆర్ఎస్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ మృతి పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఫోన్ ద్వారా సందేశం పంపి సంతాపం తెలియజేశారు. ఆర్ఎస్ కుమార్తెలు పొత్తూరి సుశీల, వేగేశ్న భరతమాత, అల్లుళ్లు వెంకటనరసింహారాజు, రామకృష్ణంరాజు, కృష్ణంరాజు, ఆర్ఎస్ సోదరుని కుమారుడు రుద్రరాజు సత్యనారాయణరాజు, మనవళ్లు, మనవరాళ్లు, బంధుమిత్రులు, స్నేహితులు ఆర్ఎస్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, నరసాపురం మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాద్‌రాజు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సిలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహన్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, డి.రమాదేవి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి మోహన్ రంగా, ప్రముఖ వైద్యులు వర్మ, జిల్లా జడ్జి అమర్ ఆర్ఎస్ భౌతికకాయాన్ని సందర్శించి పులమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, జి.రాజు, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, పివి రామకృష్ణ, గుడిపాటి నరసింహారావు, సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా నేతలు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, చింతకాయల బాబూరావు, జుత్తిగ నరసింహమూర్తి, డి.కళ్యాణి, కవురు పెద్దిరాజు, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పి.పూర్ణ, ఎ.అజయకుమారి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, జిల్లా అధ్యక్షులు శర్మ, స్వాతంత్ర సమరయోధులు కేతా సూర్యారావు, ఆచంట మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.విజయ్, ఎం.క్రాంతిబాబు, నేత చిన్నం చిననాగేశ్వరరావు, వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతుల సంఘం జిల్లా నేత మామిడిశెట్టి రామాంజనేయులు, ఐలూ నేతలు కామన మునిస్వామి, పి.శ్రీనివాస్, ఐద్వా నేత జయప్రభ, ఎంసిపియుఐ నాయకులు రాంబాబు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు దండు శివరామరాజు, జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.ఈశ్వరయ్య, సిఐటియు నేత ఎం.ఆంజనేయులు, విద్యావేత్త అలుగు ఆనంద శేఖర్, సిపిఎం కోనసీమ జిల్లా కార్యదర్శి కారం వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నేతలు జువ్వల రాంబాబు, కాకినాడ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఏలూరు జిల్లా నేతలు ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, కె.శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, నేత పి.క్రాంతి ఆర్ఎస్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు

ప్రభుత్వ లాంఛనాలతో ఆర్ఎస్ అంత్యక్రియలు..

ఆర్ఎస్ స్వగ్రామం చించినాడలో ఆర్ఎస్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. ఆర్ఎస్ స్వగృహం వద్ద నరసాపురం డిఎస్‌పి ఆధ్వర్యంలో పోలీసులు ఆర్ఎస్ భౌతికకాయం వద్ద గౌరవ వందనం సమర్పించారు. అనంతరం గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించారు. గోదావరి రేవు వద్ద ఉన్న శ్మశానవాటికలో అధికారిక లాంఛనాలతో ఆర్ఎస్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవసూచకంగా పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఆర్ఎస్ చితికి నిప్పంటించారు.

ఘనంగా ఆర్ఎస్ అంతిమయాత్ర

ఆర్ఎస్ అంతిమయాత్రలో వేలాదిమంది పాల్గొన్నారు. కమ్యూనిస్టు యోధుడిని కడసారి చూసేందుకు పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలొచ్చారు. అనంతరం హైవే రోడ్డు మీదగా పంచాయతీ సెంటర్, పెదవీధి, చినవీధి, పంచాయతీ రోడ్డు గుండా గోదావరి రేవు వద్ద ఉన్న శ్మశానవాటిక వరకూ యాత్ర సాగింది.



నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర నేత మధు



నివాళులర్పిస్తున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు



నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్సి అంగర రామ్మోహన్‌రావు

పేదలకు ఆర్ఎస్ మరణం తీరనిలోటు

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

పేదలకు ఆర్ఎస్ మరణం తీరని లోటు. ఆయన అకాల మరణం అత్యంత బాధాకరం. పీడిత ప్రజల సమస్యల కోసం పోరాడిన ధన్యజీవి ఆర్ఎస్. పేద ప్రజలకు ఆయన మరణం తీరని లోటు. ఆర్ఎస్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

ఆర్ఎస్ మృతి బాధాకరం

నరసాపురం మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు

ఆర్ఎస్ మృతి అత్యంత బాధాకరం. ఆర్ఎస్‌ది, నాది ఒకే ఊరు. సమస్యలపై కలిసి పని చేసేవారం. ఎన్నికల సందర్భంగా ఆయనతో కలిసి పని చేసే అవకాశం దక్కింది. ఆర్ఎస్ తరచూ ఫోన్ చేసి వివిధ సమస్యలపై మాట్లాడే వారు.

పెద్ద దిక్కు కోల్పోవడం బాధాకరం

మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు

ప్రజల కోసం కష్టపడే వ్యక్తి ఆర్ఎస్, అటువంటి వ్యక్తిని జిల్లా కోల్పోవడం అత్యంత బాధాకరం. ఆయనంటే నాకు ఎంతో గౌరవం. పేద ప్రజల కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి ఆర్ఎస్. నేను ఇష్టపడే నాయకుల్లో ఆర్ఎస్ ఒకరు. ఏడాది క్రితం ఫోన్ చేసి కలవాలని చెప్పారు. ఆయనకు నేనంటే ఎంత ప్రేమో దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రజల కోసం కష్టపడేవారు ఏ పార్టీలో ఉన్నా గౌరవించే మనస్తత్వం ఆర్ఎస్‌ది.

ఆర్ఎస్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ఆర్ఎస్‌లాంటి మహాయోధుడిని కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఆర్ఎస్ పాత్ర కీలకమన్నారు. పీడిత ప్రజల పక్షాన అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారంలో ఆర్ఎస్ అందించిన సేవలు అమోఘం. మంచి మనిషిని కోల్పోవడం బాధగా ఉన్నప్పటికీ అయినా ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ప్రధాన కర్తవ్యంగా సాగుతాం. ఆర్ఎస్‌ను కంటికి రెప్పల అనుక్షణం కాపాడిన కుటుంబ సభ్యులకు సిపిఎం ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల కమిటీల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ముఖ్యంగా ఆర్ఎస్‌కు సేవలందించిన విజయకు ప్రత్యేక ధన్యవాదాలు.

మాస్ లీడర్ ఆర్ఎస్

ఎ.రవి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి

ప్రజా ఉద్యమ నేత ఆర్ఎస్ మాస్ లీడర్. గిరిజనుల సమస్యలపై ఆర్ఎస్ చేసిన పోరాటాలు ఎనలేనివి. ఆర్ఎస్ పోరాట పటిమను అందిపుచ్చుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలి.

ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి అరుణ్

ఆర్ఎస్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆర్ఎస్ నాకు చిన్నతనం నుంచి తెలుసు. పోరాట సమయంలో, వివిధ సందర్భాల్లో రాజమండ్రి వచ్చినప్పుడు తరచూ కలిసే వాడిని. గొప్ప పోరాట యోధుడిని కోల్పోవడం బాధాకరం.

ఉద్యమాలను విస్తరించాలి

సిపిఎం కోనసీమ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

ఆర్ఎస్ స్ఫూర్తితో ఉద్యమాలను విస్తరింపజేయాలి. ఆర్ఎస్ అంటే ఒక చరిత్ర. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాలను ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన చివరి శ్వాస వరకు బడుగు, బలహీనవర్గాల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారు.

ఆర్ఎస్ స్ఫూర్తితో ముందుకు

రాజశేఖర్, సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి

ఉద్యమ బాటలో ఆర్ఎస్ స్ఫూర్తితో ముందుకు సాగాలి. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆర్ఎస్ అకాల మరణం అత్యంత బాధాకరం. ఆర్ఎస్ నమ్మిన సిద్ధాంతానికి ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులంతా భాగస్వాములు కావాలి.

ఆర్ఎస్ అడుగుజాడల్లో నడుస్తాం

ఆర్ఎస్ సోదరుని కుమారుడు సత్యనారాయణరాజు

ఆర్ఎస్ అడుగుజాడల్లో కుటుంబమంతా నడుస్తాం. మళ్లీ ఆర్ఎస్‌లాంటి వ్యక్తి పుట్టరు. ఆయన అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారు. ఆర్ఎస్‌కు నివాళులర్పించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మా కుటుంబ తరపున ధన్యవాదాలు.

ఆర్ఎస్ అంతిమయాత్రలో నేతలు, కార్యకర్తలు

పొంగిన పాతవయ్యేరు

నీటమునిగిన చెంచుల కాలనీ

బాధితులను పునరావాస కేంద్రానికి తరలింపు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలానికి వరద ముప్పు మొదలైంది. శుక్రవారం తెల్లవారుజామున పాతవయ్యేరు కాలువ నీరు చెంచులకాలనీలోకి మోకాళ్లలోతు చేరడంతో ఒక్కసారి అలజడి రేగింది. దీంతో అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తమై అక్కడికి చేరారు. సమతానగర్ మలుపు వద్ద చెంచులకాలనీ వద్ద గట్ల పైనుంచి నీరు పొంగి పొర్లడంతో తాత్కాలికంగా ఇసుక బస్తాలతో అడుకట్ట వేశారు. ఈ నేపథ్యంలో కాలనీలోని సుమారు 50 కుటుంబాలను అక్కడి నుంచి స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి తరలించారు. భోజనాలు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు చెప్పారు.

పునరావాస కేంద్రంలో కలెక్టర్ పరిశీలన..

స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన చెంచుల పునరావస కేంద్రాన్ని శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నాగరాణి పరిశీలించారు. ముందుగా నీట మునిగిన చెంచులకాలనీని, పాత వయ్యేరు కాలువ నీటి ప్రవాహ పరిస్థితిని, గట్లను ఆమె పరిశీలించారు. గట్ల వద్ద మరింత బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ నుండి జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన శిబిరంలో బాధితులను పరామర్శించారు. చెంచుల పిల్లలతో కాసేపు ఆమె ముచ్చటించారు. బడిఈడు పిల్లలకు ప్రత్యేకంగా చదువు చెప్పాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పోతరాజుకు ఆదేశించారు. వారికోసం ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని చెప్పారు. వరద ప్రభావం తగ్గే వరకూ ఇక్కడే ఉండాలని అనవసరంగా అక్కడికి వెళ్లొద్దని ఆమె కాలనీవాసులకు సూచించారు.

నీటమునిగిన చెంచుల కాలనీ

మా ఇళ్లను తొలగించొద్దు

తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మిక నగర్ వాసుల ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

తమ ఇళ్లను తొలగించొద్దంటూ ఐ.భీమవరం రోడ్డులోని కార్మికనగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. వాటికి ప్రత్యామ్నాయంగా పక్కా ఇళ్లు నిర్మించాలని కోరుతూ వారు డిప్యూటీ తహశీల్దార్ ఫారుక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తాము 50 సంవత్సరాలుగా కార్మికనగర్ కాల్వ గట్టుపైనే నివసిస్తున్నామన్నారు. ఈ నెల నాలుగో తేదీన నగర పంచాయతీ కమిషనర్ తమ ఇళ్లు తొలగించాలని నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఇళ్లను తొలగిస్తే తాము రోడ్ల పాలవుతామని, ఎంఎల్ఎ పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీ చేయమనడం అన్యాయమన్నారు. దుంపగడపకు వెళ్లే కాలువకు తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. కొంతమంది దురుద్దేశంతోనే దుంపగడప జ్వరాలకు తామే కారణమని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నిజమైన కాలుష్యం వెదజల్లే వారిని అరికట్టాలన్నారు. తమకు పునరావాసం కల్పించకపోతే కదిలే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ధర్నాలో సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు, అధ్యక్షులు పెంకి అప్పారావు, పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బివి.వర్మ, ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు డోకల.లక్ష్మి, ఎస్.ఉదయకుమారి, డివైఎఫ్ఐ నాయకులు జి.ధనుష్, డి.రవితేజ మాట్లాడారు. బాధితులకు సంఘీభావం తెలిపారు. ధర్నాలో ప్రజాసంఘాల నాయకులు జి.రాంబాబు, వై.కృష్ణవేణి, డి.పద్మ, ఎల్.బలరాం పాల్గొన్నారు.

టిడిపి వద్దంది.. జనసేన రమ్మంది..!

జనసేనలోకి జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులు

వైసిపికి రాజీనామా

రెండు, మూడురోజుల్లో జనసేనలో చేరనున్నట్లు వెల్లడి

టిడిపి, జనసేన బంధానికి బీటలు వారేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ, ఆమె భర్త ప్రసాద్ వైసిపిని వీడి జనసేనలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో జనసేనలో చేరనున్నట్లు వారే స్వయంగా వెల్లడించిన పరిస్థితి నెలకొంది. ముందుగా టిడిపిలోకి చేరాలని ప్రయత్నించగా టిడిపి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. టిడిపిలోకి వెళ్లేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించకపోవడంతో కూటమిలో ఉన్న జనసేనలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. టిడిపి వద్దంటే...పొత్తులో ఉన్న మరో పార్టీ జనసేన చేర్చుకోవడం జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పదవిని కాపాడుకునేందుకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు పార్టీ మారుతున్నట్లు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో 2021 మార్చిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. 48 జెడ్‌పి స్థానాలకుగాను 46 చోట్ల వైసిపి అభ్యర్థులే గెలుపొందారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి బిసిలకు కేటాయించడంతో యలమంచిలి మండలం జెడ్‌పిటిసిగా గెలుపొందిన కవురు శ్రీనివాస్ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2023 మార్చిలో జరిగిన స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో కవురు శ్రీనివాస్‌కు పార్టీ ఎంఎల్‌సి టిక్కెట్ ఇవ్వడంతో గెలుపొందారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవికి ఆయన రాజీనామా చేశారు. జెడ్‌పి ఛైర్మన్ ఎంపికపై వైసిపి డైలమాలో పడింది. మూడు నెలల తర్వాత జూన్‌లో జెడ్‌పి ఛైర్మన్‌గా పెదపాడు జెడ్‌పిటిసిగా ఉన్న గంటా పద్మశ్రీని ఎంపిక చేసింది. 2023 నుంచి పద్మశ్రీ జెడ్‌పి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మే 13న జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయంపాలైంది. టిడిపి కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులు డైలమాలో పడ్డారు. ఇప్పటికే ఏలూరు మేయర్ దంపతులతోపాటు, పెద్దఎత్తున కార్పొరేటర్లు టిడిపిలో చేరి షేక్ నూర్జహాన్ తన మేయర్ పదవిని కాపాడుకున్నారు. బుద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబు వంటి వైసిపి నాయకులు టిడిపిలో చేరిపోయారు. ఏలూరు ఎంఎల్ఎ ఆళ్లనాని, వైసిపి పదవులకు, పార్టీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేసేశారు. దాదాపు రెండేళ్ల పదవికాలం ఉండటంతో ఛైర్మన్ పదవిని కాపాడుకునేందుకు ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, భర్త ప్రసాద్ పార్టీ మారేందుకు ఎప్పటినుంచో ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. చింతమనేని ప్రభాకర్ అడ్డు పడటంతో వారి ప్రణాళికలు పారలేదని తెలుస్తోంది. పదవి కాపాడుకోవాలంటే కూటమిలో ఉన్న జనసేనలో చేరితే బాగుంటుందని భావించి చేరినట్లు అభిప్రాయం వ్యక్తమవుతోంది. పద్మశ్రీ జెడ్‌పి ఛైర్మన్‌గా కొనసాగేందుకు టిడిపి నాయకులు ఒప్పుకుంటారా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఒకవేళ ఆమెను ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని చూస్తే టిడిపి, జనసేన మధ్య విబేధాలు వచ్చే పరిస్థితి ఉంటుందా అన్న చర్చ జిల్లా రాజకీయాల్లో నెలకొంది. ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

జిల్లా అంతటా పటిష్ట చర్యలు తీసుకున్నాం : కలెక్టర్

ఆకివీడు :జిల్లాలో అత్యంత ప్రధానమైన పోలవరం, ధవళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆకివీడులో కొల్లేరు బుడమేరు నుంచి వచ్చే నీరు కలిసేచోట ఉప్పుటేరు ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అందుకు అవసరమైన పూర్తి రక్షణ చర్యలు తీసుకునే విధంగా అధికారులను ప్రత్యేకంగా నియమించామన్నారు. జగన్నాధపురం వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టామన్నారు. యనమదుర్రు డ్రెయిన్ నీటిమట్టం 29 అడుగులకు చేరిందన్నారు. అయితే అది ప్రస్తుతం తగ్గుముఖం పట్టే పరిస్థితి ఉందన్నారు. నీటిపారుదల, డ్రెయినేజీ శాఖల అధికారులు పూర్తి పరివేక్షణలో ఉన్నారన్నారు. జిల్లా శివారు ప్రాంతంలో బుడమేరు నీరు కలుస్తూ కొల్లేరు నుంచి సముద్రంలోకి ప్రవహించే ఉప్పుటేరు పొంగిపొర్లుతోందని, అధికారులతో పాటు ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు ఇక్కడ శ్రద్ధ చూపారన్నారు. గత ఆదివారం నుంచి ఇక్కడ నీటి ప్రవాహ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తామన్నారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు మంతెన సీతారాం, బలరాం

నివాళులర్పిస్తున్న ఎ.రవి, కిషోర్, కేతా సూర్యారావు

నివాళులర్పిస్తున్న తెల్లం రామకృష్ణ, నాగమణి, సుభాషిణి

నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, మాజీ ఎంఎల్‌ఎ రాజగోపాల్

కన్నీటిపర్యంతమవుతున్న మహిళా నేతలు అజయకుమారి, పూర్ణ

గీతాలాలిపిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

నివాళులర్పిస్తున్న ఆర్‌ఎస్ కుటుంబసభ్యులు

నివాళులర్పిస్తున్న కేతా సూర్యారావు, వాసు, బాబూరావు

నివాళులర్పిస్తున్న నరసాపురం డిఎస్‌పి మురళీకృష్ణ

నివాళులర్పిస్తున్న ప్రముఖులు

భోరున విలపిస్తున్న కుటుంబసభ్యులు

నివాళులర్పిస్తున్న కె.ధనలక్ష్మి, వి.ఉమామహేశ్వరరావు

నివాళులర్పిస్తున్న వ్యకాస రాష్ట్ర నేతలు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, కవురు పెద్దిరాజు

చితికి నిప్పంటిస్తున్న మంతెన సీతారాం

ఫ్రైడే డ్రైడేతో దోమల నివారణ

గణపవరం: ప్రతి శుక్రవారం గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తే దోమలను నివారించవచ్చునని కాశిపాడు ఆరోగ్య ఉపకేంద్రం ఆరోగ్య సహాయకులు నామాలరాజు అన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంఎల్ఎహెచ్ పి.మాధురి, ఎఎన్ఎం శివకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు సాయమ్మ, శ్రీదేవి, మేరిగోల్డ్, కృష్ణకుమారి, ఆశాలు భవాని, దుర్గా, కృష్ణకుమారి పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

గణపవరం: గణపవరంలోని ప్రార్థనా మందిరం 12వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కల్వరి యాగంలో శుక్రవారం ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞులు ఎన్.సాయిరాజ్(పాల్ రాజ్), జాన్ ఇమ్మానియేల్ రాజు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

డాక్టర్ వేగేశ్న శివరంజని

భీమవరం టౌన్: తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని డాక్టర్ వేగేశ్న శివరంజని అన్నారు. భీమవరం శ్రీసంతోషిమాత కోచింగ్ సెంటర్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. శ్రీసంతోషిమాత కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్, కెజిఆర్ఎల్ కళాశాల అధ్యాపకులు నాచు శ్రీవల్లి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్షదైవం గురువులేనని, సమాజంలో అన్ని వర్గాల వారితో గౌరవింపబడే వారు ఉపాధ్యాయులని అన్నారు. అనంతరం 10 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లాసికల్ డాన్స్ టీచర్లు పులపర్తి బాబి, ఎస్‌టిపి లక్ష్మి, స్వరూప, వైష్ణవి, మాలిని, భవాని, మృదుల పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

భీమవరం టౌన్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సులువుగా ప్రసవించగలుగుతారని, గర్భిణులు తగిన వ్యాయామం చేయాలని భీమవరం ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ సుబ్బలక్ష్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు ఉచిత పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ గర్భిణులు ఆహార నియమాలను పాటించాలని, పోషక విలువలున్న ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు.

8న అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

తణుకు: జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు ఈనెల 8వ తేదిన శ్రీచిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల తణుకులో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతకాయల సత్యనారాయణ, సంకు సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంపికలు అండర్ 14, 16, 18, 20, 23 విభాగాల్లో బాల బాలికలకు జరుగునని, సెలెక్ట్ అయిన క్రీడాకారులు సెప్టెంబరు 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నాగార్జున యూనివర్సిటీ, గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సెలక్షన్‌కి వచ్చే క్రీడాకారులు పుట్టినతేదీ, ధృవపత్రం, ఆధార్‌కార్డుతో ఆర్గనైజింగ్ సెక్రటరీ కటికితల బాబురావు సెల్ నెం 8247260545ను ఉదయం 8 గంటల నుంచి సంప్రదించాలని తెలిపారు.

వసతిగృహం పరిశీలన

వీరవాసరం : రాయకుదురు సంక్షేమ వసతిగృహాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి శోభారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. హాస్టల్లో పిల్లలకు పౌష్టికాహారం, ట్యూషన్ తరగతులు అందించాలని హాస్టల్ వార్డెన్‌కు ఆదేశించారు. హాస్టల్లోని పిల్లలకు ప్రతీవారం అనేమిక్ టాబ్లెట్స్ ఇవ్వాలని, ప్రతినెలా హాస్టల్ పిల్లలకు రక్తపరీక్షలు చేయాలని, నులిపురుగు మందులు, ఇతర మందులు అందుబాటులో ఉంచాలని, పిల్లలకు డెంటల్ పరీక్షలు చేయించాలని గ్రామ వైద్య సిబ్బందికి సూచించారు. హాస్టల్లో గార్డెన్ శుభ్రం చేసి ఔషధ మొక్కలను నాటాలని హాస్టల్ వార్డెన్‌కు తెలిపారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌కు పలు సూచనలు చేశారు. సిబ్బంది అందరూ హాస్టల్ పిల్లల సంఖ్య పెంచాలని తెలియజేశారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

నరసాపురం: కేంద్రప్రభుత్వం న్యాయవాదుల హక్కులకు భంగం కలిగించే విధంగా న్యాయవాద చట్టం 1961లో కొత్త ప్రతిపాదనలు చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నరసాపురం బార్ ప్రెసిడెంట్ చేగొండి బాలాజీ న్యాయవాదుల ఆధ్వర్యంలో కోర్టు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ మాట్లాడుతూ న్యాయవాద హక్కులకు భంగం కలిగే విధంగా న్యాయవాద చట్టాన్ని మార్పుచేసి కొత్త బిల్లును ప్రవేశపెట్టే చర్యలు వెంటనే విరమించుకోవాలన్నారు. న్యాయవాదులు రంపా పుల్లాజీ, కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలోని 29వ వార్డు ముంపు ప్రాంతాల్లో ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ పర్యటించారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న నీటిని వెంటనే మోటర్లు ఏర్పాటు చేసి డి- వాటరింగ్ చేయవలసిందిగా సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. తదుపరి పట్టణ పరిధిలోని 3వ సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది హాజరు, దస్త్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, అడిదల విజయ శ్యామల పాల్గొన్నారు.

సిఎం సహాయనిధికి విరాళం

మొగల్తూరు: వరద బాధితుల సహాయార్థం కొత్తకాయల తిప్పకు చెందిన జనసేన నాయకులు లక్కు బాలాజి సిఎం సహాయ నిధికి ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం సాయంత్రం రూ.5వేల డిడిని తహశీల్దార్ సిహెచ్.విద్యాపతికి రెవెన్యూ కార్యాలయంలో అందించారు. నాయకులు మెండు రాజేష్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆర్‌ఎస్ మృతి పార్టీకి తీరని లోటు

చెరుకువాడ గ్రామ సర్పంచి సాంబశివరావు

ఉండి: మాజీ ఎంఎల్ఎ, సీనియర్ నాయకులు రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్‌ఎస్) మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు అని మండలంలోని చెరుకువాడ గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు అన్నారు. శుక్రవారం చెరుకువాడ గ్రామపంచాయతీ ఆవరణలో ఆర్‌ఎస్ మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఆర్‌ఎస్ తనలాంటి ఎంతోమంది సిపిఎంలోకి రావడానికి స్ఫూర్తిగా నిలిచారని, అటువంటి వ్యక్తి మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటు అని, ఆయన మృతికి తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చీరల శేషు, నిమ్మితి కిషోర్, పడమటి ఆంజనేయులు, చీరల శ్రీనివాసరావు, పడమటి నాగేశ్వరరావు, బొర్రా త్రిమూర్తులు, తాళం సురేష్ పాల్గొని ఆర్‌ఎస్ మృతికి నివాళులర్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

గణపవరం: మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం స్థానిక లయన్స్‌క్లబ్ ఆవరణలో యుటిఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. సన్మానగ్రహీతలు ఎ.ప్రసాద్‌రావు రాజు, ఎల్.ప్రసాద్‌రావు, టి.సరస్వతి, బివిబిఎస్.లక్ష్మి, నిడమర్రు రెండవ ఎంఇఒ కె.రాంబాబుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.నాని, జి.భగవాన్ ప్రసాద్, బి.రమేష్, ఎం.పెద్దిరాజు, కేటి సుందరకుమార్, సిహెచ్.లీలాగోపాల్, పి.సౌజన్య, డి.నరసమ్మ, రమేష్, వెంకటరమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సర్పంచి ఆర్థిక సాయం

కాళ్ల: దొడ్డనపూడి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో అక్కిశెట్టి గంగన్న మృతిచెందారు. దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అక్కిశెట్టి గంగన్న కుటుంబానికి సర్పంచి కొల్లి సుబ్బారావు తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయం శుక్రవారం అందించారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

నరసాపురం: జిల్లా కలెక్టర్ నాగరాణిని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిషనర్‌గా నియమితులైన ఆయన ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఇరువురు పట్టణంలోని పలు అంశాలపై చర్చించుకున్నారు.

చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: అశ్లీలతకు తావులేకుండా వినాయక చవితి ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత నియోజవర్గంలోని టిడిపి, జనసేన శ్రేణులకు, ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడాది వినాయక చవితి ఉత్సవాలకు నిబంధనలు ఉండేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



ప్రోత్సాహకం అందజేస్తున్న గులిపల్లి అచ్చారావు

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఉండి: ప్రతిభావంతులైన విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు కోటా సీతాదేవి మెమోరియల్ క్యాష్ అవార్డులను వారి తనయులు కోటా శ్రీకాంత్, కోటా శ్రీనివాసరావు అందజేస్తున్నట్లు రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు తెలిపారు. శుక్రవారం ఉండి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు ప్రోత్సహకాలను అందజేసిన తర్వాత వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తన తల్లి పేరిట నగదు ప్రోత్సాహకాలను శ్రీకాంత్, శ్రీనివాస్ అందజేయడం జరుగుతుందని, వచ్చే సంవత్సరం మొదటి మూడు స్థానాల్లో నిలబడిన విద్యార్థులందరికీ కోటా సీతాదేవి మెమోరియల్ క్యాష్ అవార్డులు అందజేయడం జరుగుతుందని, ప్రతిఒక్కరూ ఆ అవార్డు అందుకునేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్యాష్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరమల్లు మల్లేశ్వరరావు, ముంగండ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసంద్రంగా మొగల్తూరు సెంటర్

మొగల్తూరు: మండల కేంద్రం మొగల్తూరులో వినాయక చవితిని పురస్కరించుకుని గాంధీ బొమ్మ సెంటర్ మార్కెట్ గురువారం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. గ్రామాల నుంచి పూజా సామాగ్రి కొనుగోలు చేసుకునేందుకు అత్యధికంగా ప్రజలు తరలివచ్చారు.

చవితి ఉత్సవాల సందర్భంగా పూజా సామాగ్రి ధరలు రెట్టింపు అయ్యాయి. గత సంవత్సరానికి ఇప్పటికీ ధరలు చాలా వ్యత్యాసం ఉండడంతో కొనుగోలుదారులు జేబులకు చిల్లుపడ్డది.

వరద బాధితులకు సాయం

కాళ్ల: విజయవాడలో ఉన్న భయంకరమైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని శ్రీభార్గవ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఆహారం అందించేందుకు ముందుకు వచ్చారు. జువ్వలపాలెం గ్రామానికి చెందిన శ్రీభార్గవ్ రెస్టారెంట్ అధినేత ఆర్.సతీష్ వర్మ ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. సతీష్‌వర్మ స్వయంగా వ్యాన్‌లో వెళ్లి విజయవాడలోని సింగ్ నగర్‌లోని బాధితులకు అందజేశారు. ఆయన వెంట ఎం.శివరామరాజు, రెస్టారెంట్ సిబ్బంది ఉన్నారు.

కాళ్ల : ఆహారం పంపిణీ చేస్తున్న సతీష్‌వర్మ

పాలకొల్లు : పాలకొల్లు నుంచి విజయవాడ వరద బాధితులకు వివిధ రకాల మెటీరియల్, ఆహారం, మందులు, తాగునీరుతో కూడిన వాహనాన్ని విజయవాడకు పంపారు. నరసాపురం సబ్ కలెక్టర్ అంబరీష్ పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం జెండా ఊపి వాహనాన్ని విజయవాడకు పంపారు.

ఉండి: వాంద్రం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎఆర్ ఫిష్ ప్రొడక్ట్స్ అధినేత ద్వారంపూడి నారాయణరెడ్డి విజయవాడలోని వరద బాధితులకు సహాయంగా రూ.లక్ష చెక్కును మండల తహశీల్దార్ కావడి నాగార్జునకు అందజేశారు. లయన్స్ అధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి ఉన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు పెన్మేత్స నాగరాజు పేర్కొన్నారు. కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు సందర్భంగా అన్నదాన నిమిత్తం వినాయక విగ్రహం ఏర్పాటుకు దాట్ల శ్రీదేవి ట్రస్టు అధినేత దాట్ల వెంకట రామరాజు నగదు అందించేందుకు ముందుకు వచ్చారు. సగర్లపేటలో వినాయక చవితి వేడుకల్లో అన్నదాన నిమిత్తం రూ.10,116 ట్రస్ట్ సభ్యులు పెన్మేత్స నాగరాజు, కోలా ఆంజనేయులు చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కాళ్లకూరు కొత్త కాలనీలో వినాయకుని విగ్రహం ఏర్పాటుకు రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు.

జిల్లా వాసులకు అభినందనలు : కలెక్టర్


ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

భీమవరం: ఆపత్కాల సమయంలో మేమున్నామని ముందుకు వస్తున్న దాతలకు కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పెద్ద అమిరం స్వామి వివేకానంద సేవాసమితి అధ్యక్షులు వేగిరాజు శివవర్మ రూ.5 లక్షలు, పూర్వ జిల్లావాసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని శ్రీగోపికృష్ణ ఇన్ఫ్రస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కనుమూరి గోపాలరాజు రూ.5 లక్షల చెక్కులను వారి సహాయకులతో జిల్లా కలెక్టరేట్లో శుక్రవారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలో వచ్చిన ఆకస్మిక వరదల నుంచి ప్రజలను ఆర్థికంగా, మానసికంగా ధైర్యాన్ని కలిగించేందుకు దాతల సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. చేయి చేయి కలిపితే చిన్న సహాయం కూడా పెద్ద సహాయంగా మారుతుందని, ఉన్నదానిలో ఎంతో కొంత సహాయం చేయాలని, పెద్ద మనసు కలిగిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అన్నారు. జిల్లాకు అన్నపూర్ణగా ఉన్న నామకరణాన్ని సార్థకం చేస్తూ దాతలు చూపిస్తున్న ఆదరణ ఎన్నటికీ మరువరానిదని తెలిపారు.

పలుచోట్ల పౌష్టికాహార మాసోత్సవ ఉత్సవాలు

పాలకొల్లు రూరల్: మండలంలోని దగ్గులూరు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవ ఉత్సవాలు ఐసిడిఎస్ సిడిపిఒ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహార ప్రాముఖ్యత, తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, న్యూట్రిషన్ కిట్ల గురించి ఇందిర వివరించారు. బాలింతలు, పిల్లల బరువు, ఎత్తు తీసి వారి వయసుకు తగ్గ బరువు ఉండాలని వారికి అవగాహన కల్పించారు.

కాళ్ల : మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ఐసిడిఎస్ శాఖ పనిచేస్తుందని కాళ్ల అంగన్వాడీ సూపర్వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. మండలంలోని సీసలి గ్రామంలో పోషకాహార మాషోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. పోషకాహార మాసోత్సవాలు ఈనెల 1 నుంచి 30 వరకు జరుగుతాయి. ఎఎన్ఎం, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఉండి: చిన్నారులలో శారీరక, మేధాశక్తి పెరుగుదల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పోషన్ బి పడాయి బి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.నిర్మల అన్నారు. శుక్రవారం ఉండి మండలం చిలుకూరులో నిర్వహించిన ఆకివీడు ప్రాజెక్టు యండగండి సెక్టార్ చిలుకూరు అంగన్వాడీలో పోషణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోషణ్ బి పడాయి బి కార్యక్రమం నిర్వహించారు. ఎఎన్ఎం జె.లక్ష్మి, వి.జ్ఞానేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈనెల 30 వరకు అన్ని గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. శుక్రవారం నత్తా రామేశ్వరం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్, బాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. తర్వాత మాముడూరు, మార్టేరు ఉన్నత పాఠశాలల్లో సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు.

వరిచేలు, చేపల చెరువుల సర్వేనెంబర్లు పరిశీలన

గణపవరం: ఇ షిప్ నమోదు తప్పులకు తావు లేకుండా పక్కాగా నమోదు చేయాలని జెసి టి.రాహుల్‌కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం గణపవరం మండలం కేశవరం గ్రామానికి సంబంధించి ఎక్కడ వరిపొలాలు, ఎక్కడ చేపల చెరువులు ఉన్నాయే సర్వే నెంబర్లు వారిగా క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ భూమి చేపల చెరువులో ఉండటంతో మత్స్యశాఖాధికారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు ఒక టీమ్‌గా ఏర్పాటు చేసుకొని క్షేత్ర స్థాయిలో సర్వేచేయాలని జెసి సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు, గణపవరం తహశీల్దార్ వైకెవి.అప్పారావు ఉన్నారు.

పాఠశాలలో పోటీలు

తణుకు: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సిఇఒ క్లబ్, జీవశాస్త్ర విభాగం ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విగ్రహాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థినులకు గీత స్కాలర్‌షిప్ అందజేత

భీమవరం టౌన్ : ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థినులచే ఏర్పాటుచేసిన గీత స్కాలర్‌షిప్‌ను ఈ ఏడాది ముగ్గురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున అందించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న వారిలో మూడవ సంవత్సరం ఇసిఇ విద్యార్థిని జివిఆర్ శ్రీదేవి, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని కె.భాను, రెండవ సంవత్సరం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని ఎన్.ధనలక్ష్మి ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ప్రతి ఏటా ముగ్గురు విద్యార్థినులకు గీతా రాజ్ పేరిట కళాశాల అల్యూమిని అసోసియేషన్ ద్వారా గీతా స్కాలర్‌షిప్ అందిస్తున్నారని వివరించారు. అల్యూమిని అసోసియేషన్ అనిల్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

తణుకు: నియోజకవర్గ ప్రజలు పర్యావరణాన్ని కాపాడే విధంగా బాధ్యతగా రంగులు, కెమికల్స్ లేని మట్టి విగ్రహాలను పూజించి సమాజ పురోభివృద్ధికి సహకరించాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తణుకు మైత్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తణుకు పట్టణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేశారు. టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, మైత్రి లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం: మండలంలోని సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ట్రెజరర్ కె.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: రోటరీ క్లబ్ పాలకొల్లు వారు మట్టి వినాయకుల విగ్రహాలు పంపిణీ చేశారు. పర్యావరణాన్ని రక్షిదం, మట్టి వినాయకుడిని పూజిద్దాం అని నినదించారు. ఈ వినాయక విగ్రహాలకు రోటరీ సభ్యులు చందక రాము, మద్దాల వాసు, పెనుమాక రామ్మోహన్ రావు, అత్తోట రవి ఆర్థిక సహాయం చేశారు. ప్రెసిడెంట్ రావాడ సతీష్, సెక్రటరీ జవ్వాజి కల్యాణ్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: శశి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యాన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇస్మాయిల్, అధ్యాపకులు అభినందించారు.

పర్యావరణాన్ని రక్షించే విధంగా పండుగలు జరుపుకోవాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వాణి స్కూల్ డైరెక్టర్ వాణికృష్ణ తెలిపారు. వాణి సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

మొగల్తూరు : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆరోగ్య వర్షిని ట్రస్ట్ సభ్యులు వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ట్రస్టు సభ్యులు కోరారు. ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు, బందన విజయకుమార్ ఉన్నారు.

ఆకివీడు : మట్టి గణపతితో పర్యావరణం రక్షించండి అంటూ అజ్జమూరు గరువు ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వి.నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రచారం నిర్వహించారు. గణపతిపూజ, పర్యావరణ కాలుష్యం గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయురాలు నాగ కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి: ఉండి మెయిన్ సెంటర్లో లయన్ భూపతిరాజు హరినాథ్ రాజు ఆర్థిక సహకారంతో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు భూపతిరాజు హరినాధరాజు, గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, బొండాడ కేశవరావు పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 44-45/General/2024-25, Dated. 06-09-2024

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Providing Tiffin and Food Packets for Vijayawada Flood Effected areas Distribution in Municipal Corporation, Eluru."** Total No. of works is **2** with an amount of Rs. **80.00** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 07-09-2024. Last date of receipt of tenders is 10-09-2024. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU